## క్లుప్తంగా

### పెద్దమందడి విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈనెల 6న నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్-14 బాలురు, బాలికల హాకీ క్రీడాకారుల ఎంపికలో పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఆర్.రేవతి, ఆర్.అంజలి, 9వ తరగతి చదువుతున్న శివశంకర్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలో వీరు పాల్గొంటారన్నారు.

### ఆహార కమిటీలు తిన్నాకే విద్యార్థులకు వడ్డించాలి

గోపాల్‌పేట: వసతిగృహాల్లో వండిన వంటకాలను ఆహార కమిటీ సభ్యులు తిన్నాకే విద్యార్థులకు వడ్డించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయా వసతిగృహాల్లో బియ్యం, కూరగాయలు, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని వార్డెన్లకు సూచించారు. తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, వంటగది, విద్యార్థినుల గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డెన్లు జీవిత, రమేష్‌గౌడ్ ఉన్నారు.

### ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు

గోపాల్‌పేట: మండలంలో గురువారం ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం నాలుగున్నరకు వనపర్తికి చెందిన గోపి గోపాల్‌పేట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తుండగా నర్సింగాయపల్లికి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో గోపాల్‌పేటకు చెందిన చిన్నబాలి అనే వ్యక్తి వనపర్తి నుంచి స్వగ్రామానికి వస్తుండగా అక్కడే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా వెనక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం చిన్నబాలి చేతిపై నుంచి వెళ్లింది. దీంతో చిన్నబాలి చేతికి పెద్ద గాయమైంది. స్థానికులు గుర్తించి వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదం జరిగిన పది నిమిషాల వ్యవధిలోనే గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట వనపర్తికి చెందిన మణ్యం ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. అయితే గోపి, మన్యం మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. ప్రమాదాలపై గోపాల్‌పేట ఎస్‌ఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

### నిందితుడికి 14 రోజుల రిమాండ్

ఆత్మకూర్: భార్య బలవన్మరణం కేసులో భర్తను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చడంతో న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌లోని బీసీకాలనీలో నివాసముంటున్న శ్రావణి(30) ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుమార్తె మృతికి ఆమె భర్త పరశురాములు కారకుడని శ్రావణి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి ఆత్మకూర్ కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించామన్నారు.

### రైతు సంక్షేమమే కాంగ్రెస్ అజెండా



సాక్షి, నెట్‌వర్క్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ అజెండా అని మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన పేరిట మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగకు సభకు రైతులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి అమిస్తాపూర్ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జన్ను వెంకటనారాయణ, నాగన్నయాదవ్, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాసులు, రాజేష్, తిర్మలేష్, రైతులు తిరుపతిరెడ్డి, ప్రభావతి, సత్యన్న ఉన్నారు.

### వాల్‌పోస్టర్ విడుదల

గోపాల్‌పేట: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాలల చైతన్యసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలోని మహనీయుల విగ్రహాల వద్ద సింహగర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

# పాఠశాల పరిసరాలు అపరిశుభ్రం

- పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల పక్కనే కుళాయి..
- 94 మంది బాలికలకు ఒక్కటే మూత్రశాల
- ప్రహరీ లేక ఆవరణలోకి పందులు, కుక్కలు



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో ఉన్న కుళాయి వద్ద విద్యార్థుల బారులు, ఆ పక్కనే మూత్రశాలలు, మరుగుదొడ్లు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కుళాయి, వంట గది పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. పాఠశాలల్లో మొత్తం 354 మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. వారిలో 93 మంది బాలికలు ఉన్నారు. బాలికలకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. మన ఊరు, మనబడి పథకంలో భాగంగా అదనంగా నిర్మించిన మూత్రశాల, మరుగుదొడ్డి, వాష్ బేసిన్లు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో పాటు విద్యార్థులు చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు అవసరమైన వాష్‌బేసిన్లకు కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న ఒకే ఒక్క కుళాయితో నెట్టుకొస్తున్నారు. ఉన్న కుళాయి కూడా మరుగుదొడ్లు, మూత్రశాలల సమీపంలో ఉండటం ఆయా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. నీటి కుళాయి, వంట గది, మరుగుదొడ్లు, మూత్రశాలల సమీపంలో ఉండటంతో రోగాలు సంభవించే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు పాఠశాలకు రెండు వైపులా ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో ఆవరణలోకి పందులు, కుక్కలు, కోతులు సంచారంతో భోజనం చేయడం ఇబ్బందిగా మారింది.



పాఠశాల ఆవరణలో పందుల సంచారం



వాష్ బేసిన్లకు ఏర్పాటు చేయని కుళాయిలు

#### మంత్రి జూపల్లి ఆదేశించినా..

సెప్టెంబర్ 28వ తేదీన పాఠశాలను మంత్రి జూపల్లి సందర్శించిన సమయంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయన స్పందించి ప్రహరీ గోడ, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత అధికారులు, స్థానిక నాయకులను ఆదేశించినా.. నేటికీ పనులు ప్రారంభించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

> **ఇబ్బందులు పడుతున్నాం..**
> మూత్రశాలలు, మరుగుదొడ్ల విషయంలో బాలికలకు ఇబ్బందిగా ఉంది. ప్రహరీ గోడ లేకపోవడంతో పందులు, కుక్కలు ఆవరణలోకి వస్తున్నాయి. ఒకే కుళాయి ఉండటంతో చేతులు కడుక్కోవడానికి అవస్థలు పడుతున్నారు.
> – విజయ్, హెచ్‌ఎం

> **వినియోగంలోకి తెస్తాం**
> మన ఊరు మన బడి పథకంలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాష్ బేసిన్లు వినియోగించిట్లేదని తెలిసింది. నేను మండలంలో కొత్తగా బాధ్యతలు తీసుకున్నా. పాఠశాలను సందర్శించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటాం.
> – విజయ్, పీఆర్ ఏఈ

ఆయా సమస్యల పరిష్కారంపై ఇప్పటికైనా అధికారులు, స్థానిక నాయకులు స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## ‘ఖిల్లా’ గట్టును పర్యాటక కేంద్రంగా మార్చాలి



ఫిరంగి వద్ద బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖిల్లా గట్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బి.శాంతకుమార్ అన్నారు. గురువారం ఆయన బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్‌తో పాటుగా పలువురు నాయకులతో కలిసి ఖిల్లా గుట్టపై పర్యటించారు. గుట్టపై కాకతీయుల కాలం నాటి కట్టడాలు, గుట్ట చుట్టు రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న రాతి గోడ, చెరువు, ఫిరంగి, గుట్టపైకి వెళ్లే దారిలో ఉన్న మూడు ముఖ ద్వారాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కాకతీయుల నాటి కట్టడాలను రక్షించి ముందుతరాలకు అందించాలన్నారు. గుట్టపై ఎన్నో చూడదగిన ప్రదేశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రవినాయక్, సత్యనారాయణ, గోపి ముదిరాజ్, కేశన్న, దశరథ్, శివ, రాజు, సుధీర్ దతిరులు పాల్గొన్నారు.

## హామీలు వెంటనే అమలు చేయండి



అమరచింత: ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నురుల్‌నదీం కు వినతిపత్రాన్ని గురువారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు పెన్షన్‌ను నెలకు రూ.6 వేలు అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. పెన్షన్‌ను పెంచాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 20 నుంచి డిసెంబర్ 9 వరకు దశల వారిగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం 44,49,767 మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని, కొత్తగా దరఖాస్తు చేసిన 24.84 లక్షల మందికి ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్, బ్రహ్మయ్య, గట్టన్న తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మెదడు చురుకుదనం



యోగాపై అవగాహన కల్పిస్తున్న అందె జీవన్‌రావు

కొత్తకోట రూరల్: యోగాతో మెదడుకు చురుకుదనం వస్తుందని రాష్ట్ర అవార్డు గ్రహీత అందె జీవన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని అమడబాకుల మోడల్ పాఠశాలలో రాష్ట్ర అవార్డు గ్రహీత, ఇటీవల గుంజీళ్ల మాష్టారుగా పేరొందిన అందె జీవన్‌రావు ‘సూపర్ బ్రెయిన్ యోగా’ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్ బ్రెయిన్ యోగా అనేది గుంజీళ్ల మెరుగైన విధానమని, ఈ యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. క్రమపద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా చేయడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని, ఆరోగ్యవంతమైన మేధో సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. అనంతరం కార్యశాలలో భాగంగా విద్యార్థులచే 14రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగా చేయించారు. తాను రాష్ట్ర, అంతర్జాతీయ సదస్సులో సూపర్ బ్రెయిన్ యోగా అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రాల ప్రతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌గౌడ్ కు అందజేశారు.

## ఫూలే జీవితం పేదల కోసమే అంకితం



వనపర్తి టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి దయ్యపు రాధాకృష్ణ, గంధం గట్టన్న, మధు, విశ్వం, శ్రీమాన్, లక్ష్మణ్, కుమార్, రాజు, కిషన్, మన్యం పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురుమూర్తి పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వనపర్తి: గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కోరారు. గురువారం ఈ విషయమై కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఓ వైపు ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే.. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో దురదృష్టకరమైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసం కోసం అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటన్నగౌడ్, మహేందర్, అంజన్న యాదవ్, గంధం నాగరాజు, శివనాయక్, రాఘవేందర్‌గౌడ్, సాయిబాబ, శివశంకర్, గౌతమ్, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, నగేష్ తదితరులు ఉన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్ కస్తూర్బా విద్యాలయంలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి



చంద్రనాయక్‌తండా పాఠశాలలో..



వెంకటాంపల్లి పాఠశాలలో..

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. మండలంలోని చంద్రనాయక్‌తండా ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, పరిసరాలతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ మేరకు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. పౌష్టికత్వంతో కూడిన ఆహారం అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, కూరగాయల నిల్వలు, వంట గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతినిత్యం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని, నాణ్యత, మెనూ తప్పక పాటించాలన్నారు. ఆయన వెంట డీటీ అశోక్‌నాయుడు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

**వెంకటాంపల్లి పాఠశాలలో..**

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం క్లస్టర్ హెచ్‌ఎం కాళిదాసు పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

## బయటి ఆహారం తినవద్దు



కిష్టాపూర్‌తండాలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న రామయ్య

పాన్‌గల్: విద్యార్థులు బయటి ఆహారాన్ని తినవద్దని, కలుషిత ఆహారంతో అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. అనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా గురువారం మండలంలోని కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణ, చేతులు శుభ్రం చేసుకోవడం, పౌష్టికాహారం, బయటి మార్కెట్ తినుబండారాల నివారణపై అవగాహన కల్పించారు. బయట కిరాణం షాపుల్లో లభించే కురుకురేలు, లాలిపాప్‌లు, లేస్, చిప్స్ తినకూడదని, వీటిని తినడం ద్వారా అనారోగ్యాల పాలవుతారన్నారు. పండ్లు, కాయలు, బెల్లం, నువ్వుల పట్టీలను మాత్రమే తినాలన్నారు. రక్తహీనత నివారణ కోసమే ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ లారెన్స్, పాఠశాల హెచ్‌ఎం మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయిలో రాణించిన విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీపనగండ్ల: జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కల్వరాల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు పాల్గొని ప్రథమ స్థానంలో రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల జీహెచ్‌ఎం రాజవర్ధనాచారి అన్నారు. పలు పోటీ పరీక్షల్లో పాల్గొని గ్రామంలోని యువత ప్రతి నోటిఫికేషన్‌లోనూ ఉద్యోగాలు సంపాదిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుంటున్న తమ పాఠశాల విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న కాంపిటీషన్ పరీక్షలు, క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 14 నుంచి మూడు రోజుల పాటు ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లు శ్రీనివాసులు, బలరాముడు, శ్రీనివాస్‌రెడ్డి, బక్కన్న, జితేందర్‌గౌడ్, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## సన్నరకం వడ్లు కాంటా చేయరా ?



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతు లింగాల రాములు

పాన్‌గల్: మద్దతు ధర, బోనస్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రానికి చెందిన రైతు లింగాల రాములు తాను పండించిన సన్న వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులు అవుతున్నా.. నేటికీ కొనుగోలు చేయకపోవడంతో కేంద్రంలో పడిగాపులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ వస్తుందనే ఉద్దేశ్యంతో కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే కేంద్రం నిర్వాహకులు కాంటా చేయడంలో జాప్యం చేస్తున్నారని వాపోయాడు. కేంద్రానికి ధాన్యం తీసుకురాకపోయిన బాగుండేదని, ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొంటామని, వచ్చిన వారికి అమ్మకుండా కేంద్రానికి తీసుకొస్తే జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కాంటా చేయాలన్నారు.

## కొనసాగుతున్న డేటా ఎంట్రీ



అమరచింతలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్



ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు



వనపర్తిలో..

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ వివరాల నమోదు వేగవంతంగా కొనసాగుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ, ఈజీఎస్, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో సమగ్ర కుటుంబ సర్వేలో నమోదు చేసిన వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 2,500 ఎంట్రీ చేశామని వెల్లడించారు. ఆత్మకూర్ మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 6,131 కుటుంబాలకు గాను 6,214 కుటుంబాల వివరాలు నమోదు చేశామని, మున్సిపాలిటీలో 3,400 కుటుంబాలకు గాను 3,415 నమోదు చేశామని వివరించారు.

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి మండలంలో 11,452 కుంటుబాల సమాచారం సేకరించగా.. ఇప్పటి వరకు 8,512 కుటుంబాల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఓ సుస్మిత, సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలోని పది వార్డులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణయ్య

కొత్తకోట రూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ‘పునరుత్పాదక శక్తి వనరులు’ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 24మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 30న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరులు వినియోగించడం దేశ అభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. దీంతో పాటు కాలుష్యరహిత వాతావరణం ఏర్పడుతుందని, భవిష్యత్ తరాలు ఇలాంటి ఇబ్బందులు లేకుండా జీవించే అవకాశం ఉందని తెలిపారు. తెలుగు మీడియం నుంచి మొదటి స్థానంలో సి.మంజుల 10వ తరగతి జెడ్పీహెచ్ఎస్ పాలెం, రెండో స్థానంలో ఎస్.మహేశ్వరి 8వ తరగతి జెడ్పీహెచ్ఎస్ అప్పరాల, ఇంగ్లిష్ మీడియం నుంచి మొదటి స్థానంలో విశ్వవికాస్ 9వ తరగతి ప్రభుత్వ హైస్కూల్ కొత్తకోట, రెండో స్థానంలో తరుణ్ 10వ తరగతి భారతీయ విద్యా మందిర్ కొత్తకోట విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 50 పందులు అదృశ్యం

గోపాల్‌పేట: యాభై పందులు అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల మేరకు.. ఏదుట్ల గ్రామానికి చెందిన యాత్కిరి వెంకటయ్య, యాత్కిరి వెంకటరమణ ఇద్దరు మున్ననూరు రోడ్డులో ఉన్న చెరువు సమీపంలో 50 పందులను పెంచుకునేవారు. ఈనెల 25 నుంచి యాభై పందులు కనిపించలేదు. రెండు రోజులు వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.